ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
శనివారం 29 జూన్ 2024

అడుగుకో గుంత...!



ఎమ్మిగనూరు పట్టణం గోనెగండ్ల సర్కిల్ పెట్రోల్ బంకు వద్ద కర్నూలు ప్రధాన రోడ్డు దుస్థితి

- అధ్వానంగా జిల్లా ప్రధాన రహదారులు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితం
- వర్షాకాలంలో ప్రమాదకరంగా మారిన రోడ్లు
- మరమ్మతులపై దృష్టి పెట్టిన టీడీపీ ప్రభుత్వం
- తక్షణం రూ.8 కోట్లు అవసరం

కర్నూలు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): **గత జగన్ ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం వల్ల రోడ్లు అత్యంత అధ్వానంగా మారాయి. ఏ రహదారి చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యంగా ఎన్‌డీబీ కింద వచ్చిన రూ.236 కోట్ల నిధులను కూడా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అడుగుకో గుంతతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రయాణికులను వెంటాడుతోంది. అయితే ఈ నెల 12న కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే జిల్లాలో గుంతలు పూడ్చాలంటే రూ.8 కోట్లు కావాలని రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు.**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షణలో 3,150 కి.మీ. ప్రధాన రోడ్లు ఉన్నాయి. జిల్లా విభజన తరువాత కర్నూలు జిల్లాలో 1,850 కి.మీ. రోడ్లు మిగిలాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి మరీ దారుణంగా మారాయి. గత జగన్ ప్రభుత్వంలో ఐదేళ్ల నిర్లక్ష్యం ఓ ఎత్తు అయితే.. ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆయా పద్దుల కింద నిధుల కేటాయింపులు చేయకపోవడంతో తాజాగా మరమ్మతులకు ఇబ్బందిగా మారింది. కర్నూలు, ఆదోని డివిజన్ల పరిధిలో 725 కి.మీ. మరమ్మతులకు దాదాపు రూ.8 కోట్లు అవసరం ఉందని ఇంజనీర్లు నివేదిక పంపారు. ఇది పెరిగే అవకాశం కూడా ఉందని అంటున్నారు. వచ్చే నెలలో సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న పూర్తి స్థాయి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేశాక మరమ్మతులు చేపట్టే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. అయితే.. ఉమ్మడి జిల్లాకు చెందిన బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్లు భవనాలు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో రోడ్లు గుంతలు పూడ్చడంతో సరిపుచ్చకుండా ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎర్రకోట సమీపంలో రోడ్డు దుస్థితి

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం:



ఉమ్మడి జిల్లాలో 13 ప్రధాన రోడ్లు 157.060 కిలోమీటర్లు పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) రూ.323.59 కోట్ల నిధులు కేటాయించింది. ఒకే ప్యాకేజీ కింద ఇచ్చిన నిధులు వినియోగించి రహదారుల ఆధునికీకరణకు కృషి చేయాల్సిన గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆ నిధులు నిరర్థకంగా మారాయి. ఆదోని మండలం ఢాణాపురం క్రాస్ - హొళగుంద వయా హెబ్బటం ప్రధాన రహదారి 25.490 కి.మీ. ఆధునికీకరణకు రూ.59.25 కోట్ల ఎన్‌డీబీ నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ జగన్ ప్రభుత్వంలో బిల్లులు రావనే భయంతో జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేసి వదిలేశారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కోడుమూరు-వెల్దుర్తి వయా గోరంట్ల రోడ్డు 3.00 కి.మీల నుంచి 14.500 కిలోమీటర్ల వరకు ఆధునికీకరణకు రూ.21.09 కోట్ల ఎన్‌డీబీ నిధులు ఇస్తే గంపెడు మట్టి కూడా వేయలేదు. ఎమ్మిగనూరు-మాలపల్లి రోడ్డు 0/00 నుంచి 11.885 కిలో మీటర్ల వరకు ఆధునికీకరణకు ఎన్‌డీబీ నిధులు రూ.24.15 కోట్లు మంజూరు చేస్తే అక్కడా అదే పరిస్థితి. ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డు (ఏజీ రోడ్డు) - పెద్దకడబూరు రోడ్డు 0/00 నుంచి 13.750 కిలో మీటర్ల వరకు ఆధునికీకరణకు ఎన్‌డీబీ నిధులు రూ.24.61 కోట్లు నిధులు ఇస్తే ఇక్కడ కూడా పనులు మొదలు పెట్టలేదు. వెల్దుర్తి మండలం రామళ్లకోట నుంచి బేతంచర్ల రోడ్డు 0/00 నుంచి 22.460 కి.మీ. రూ.41.72 కోట్లు మంజూరు అయితే 90 శాతం పనులు పూర్తి చేశారు. అది కూడా అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో పనులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి వైసీపీ ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పట్టించుకోకపోవడం, పనులు చేసిన బిల్లులు రావనే భయం కాంట్రాక్టర్లను వెంటాడడం వెరసి ఎన్‌డీబీ నిధులు ఉన్నా కీలకమైన రోడ్లు ఆధునికీకరణకు నోచుకోలేదు. గత పాలకుల వైఫల్యాలను ఇటీవల ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు సరిచేసి రహదారుల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తక్షణ మరమ్మతులకు రూ.8 కోట్ల అవసరం

జిల్లాలో పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్న మాట నిజమే. వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తక్షణ మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. జిల్లాలో తక్షణ మరమ్మతులకు రూ.8 కోట్ల అవసరమని నివేదిక పంపాం.

- నాగరాజు, ఎస్ఈ, రోడ్లు భవనాలు శాఖ, కర్నూలు

అధ్వానంగా ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డు

కోడుమూరు-ఎమ్మిగనూరు రోడ్డు అధ్వానంగా మారింది. 33 కిలో మీటర్ల రహదారి అడుగడుగునా గుంతల మయంగా మారంది. కర్నూలు, హైదరాబాదు, విజయవాడ, తిరుపతి, కడప ప్రాంతాలకు చెందిన భక్తులు రాఘవేంద్రస్వామి దర్శనం కోసం మంత్రాలయం వెళ్లాలంటే ఈ రోడ్డే ఆధారం. ప్రధాన రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా ఆధునికీకరణ చేస్తున్నారు. ఆ జాబితాలో ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డు చేర్చకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలు జిల్లా కేంద్రంలో ఏ అవసరం ఉన్నా ఈ రోడ్డు గుండానే కర్నూలుకు రావాల్సి ఉంది. గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంగభద్ర పుష్కరాల నిధులు సుమారు రూ.4 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. ఆ తరువాత చేతులెత్తేశారు. ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారధి ప్రత్యేక చొరవ తీసుకొని జాతీయ రహదారి జాబితాలో చేర్చి ఆధునికీకరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అదే క్రమంలో వర్షాకాలంలో వాహనదారులు ఇబ్బందులు పడకుండా తక్షణ మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గోనెగండ్ల సమీపంలో ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డు గుంతల మయం

చిక్కిన చిరుత

తిరుపతి జూకు తరలించిన అధికారులు



పచ్చర్ల అటవీ ప్రాంతంలో బోనుకు చిక్కిన చిరుత పులి

శిరివెళ్ల, రుద్రవరం, జూన్ 28 : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల చెక్ పోస్టు వెనుక వైపున ఏర్పాటు చేసిన బోనుకు చిరుత పులి చిక్కింది. అటవీశాఖ నంద్యాల డీఎఫ్‌వో అనురాగ్ మీనా, పచ్చర్ల రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య, నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్ వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకుని చిరుతను పరిశీలించారు. ఇటీవల నల్లమల పరిసర గ్రామాల్లో చిరుత పులి దాడులు తీవ్రమైన నేపథ్యంలో అధికారులు చిరుతను బంధించడానికి బోన్లు అమర్చారు. ఈ నెల 25న కట్టెల కోసం అడవిలోకి వెళ్లిన పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నీషాపై చిరుత పులి దాడి చేసి హతమార్చింది. దీంతో పచ్చర్ల గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో అటవీ శాఖ అధికారులు తరచూ చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో పలు చోట్ల బోన్లు, ట్రాప్ కెమెరాలను అమర్చారు. ఎట్టకేలకు పచ్చర్ల చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటు చేసిన బోనుకు శుక్రవారం తెల్లవారుజామున చిరుత పులి చిక్కింది. బోనుకు చిక్కిన చిరుత పులి, మహిళపై దాడి చేసి చంపేసిన చిరుత ఒకటే అనే ప్రాథమిక అవగాహనకు అటవీశాఖ అధికారులు వచ్చారు. ఐదారేళ్ల వయసు ఉన్న ఈ చిరుతను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జులాజికల్ పార్క్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో ఈశ్వరయ్య వెల్లడించారు. ఇదిలా ఉండగా పచ్చర్ల అటవీ ప్రాంతంలో మరో రెండు చిరుతలు సంచరిస్తున్నాయని మహిళలు అంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నల్లమల అటవిలో మరో రెండు చిరుతలు సంచరిస్తున్నాయి. చెలిమ, రుద్రవరం రేంజ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అడవిలోకి వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలి.

-సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

టిడ్కో ఇళ్లను నిరుపయోగంగా ఉంచడమేంటి ?

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే
- ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

ఆదోని, జూన్ 28: టిడ్కో ఇళ్లను నిరుపయోగంగా ఉంచడం ఏంటని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని సిరుగుప్ప టర్నింగ్ సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్లను ఎస్ఈ రాజశేఖర్, డీఈ హరికృష్ణ, ఏఈలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జనాలు ఉండాల్సిన ఇళ్లలో విషపురుగులు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో కాలనీ మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి టిడ్కో ఇళ్ల వరకు సర్వీసులు తిప్పేలా చూస్తానని చెప్పారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యార్థం, రహదారులు, కాలువలు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జనసేన నాయకుడు మల్లప్ప, నాగరాజుగౌడ్, సాయి, ఆచారి, విజయ్ నాయకులు ఉన్నారు.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించాలి

మంత్రి టీజీ భరత్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 28: నగరంలో నిలిచిన రోడ్ల విస్తరణ పనులను సత్వరమే ప్రారంభించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా కిడ్స్ వరల్డ్ నుంచి ఉస్మానియా కళాశాల మీదుగా జమ్మిచెట్టు వరకు, పాతబస్టాండు డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి తుంగభద్ర నది తీరాన రాఘవేంద్ర మఠం, మాసుంబాషా దర్గా నుంచి పూలబజార్ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల విస్తరణలో దుకాణాలు, భవనాలు కోల్పోతున్న యజమానులను సంప్రదించాలని అధికారులను ఆదేశించారు. చౌక్‌బజార్ నుంచి వన్‌టౌన్, వన్‌టౌన్ నుంచి జమ్మిచెట్టు వరకు కూడా రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. నగరంలోని ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న వీధి వ్యాపారులను గతంలో తొలగించారని, వ్యాపారులు వ్యాపారులు చేసుకునేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని అన్నారు. వచ్చే సమావేశంలో రోడ్ల విస్తరణ, వీధి వ్యాపారుల దుకాణానికి సంబంధించి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీసీపీ సంధ్య, ఏసీపీలు రంగస్వామి, శశికళ, టీపీఎస్‌లు శభరీష్, మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

డీసీసీబీని లాభాల బాట పట్టించండి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 28: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించి వారిని కష్టాల నుంచి గట్టెక్కించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బ్యాంకు స్థితిగతులను జీఎం రామాంజనేయులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు జీఎంతో పాటు సీఈవో విజయకుమార్, ఈఎం శివలీల పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు పంట సాగుతో పాటు ఇతరత్రా ఆర్థిక సాయం అందించి వారిని లాభాలబాట అందించేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఎంతో ముందంజలో ఉందని అన్నారు.



జేసీకి అభినందనలు తెలుపుతున్న దృశ్యం



మంత్రి భరత్‌ను కలిసిన కలెక్టర్

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంకల్‌బాగ్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా అభివృద్ధి, పాలనా వ్యవహారాలపై ఇద్దరూ చర్చించారు.

- కర్నూలు, కలెక్టరేట్

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కార్యాచరణ

విద్యుత్‌శాఖ అధికారుల సమీక్షలో మంత్రి టీజీ భరత్

కల్లూరు, జూన్ 28: కర్నూలు నగరంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విద్యుత్‌శాఖ అధికారులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి టీజీ. భరత్ ఆదేశించారు. శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన ఏపీఎస్పీడీసీఎల్ కర్నూలు టౌన్ డివిజన్ అధికారులతో సమీక్షా, సమావేశం నిర్వహించారు. నగరంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై మంత్రి చర్చించారు. ప్రధానంగా ఓల్డ్‌సిటీలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను సరిచేయాలని షార్ట్‌సర్క్యూట్ జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను మార్చాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మెయింటెనెన్స్ బాగుండాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో విద్యుత్ కోతల వల్ల పేషంట్ల ప్రాణాలకే ప్రమాదం పొంచిఉందన్నారు. ఆసుపత్రిలో విద్యుత్ నిర్వహణ సరిగా లేదని తన దృష్టికి వచ్చిందని ఆసుపత్రి అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వాటర్‌వర్క్ వద్ద 33కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు 10 సెంట్ల స్థలం అవసరం అవుతుందని ఇందుకోసం మున్సిపల్ అధికారులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం. ఉమాపతి, టౌన్ డివిజన్ ఈఈ పి. ఓబులేసు, కన్‌స్ట్రక్షన్ ఈఈ రాజేష్, టౌన్ ఏడీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

లంబాడీలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న ఆర్.కైలాస్‌నాయక్

కర్నూలు(రూరల్), జూన్28: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తండాల్లోని లంబాడీ ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కైలాస్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ 27వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు రూరల్ మండలం ఎన్ఎస్ తాండలో ముఖ్య కార్యకర్తల సమావేశం రాష్ట్ర కార్యదర్శి నాగరాజునాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా కైలాస్‌నాయక్ మాట్లాడుతూ లంబాడీ ప్రజలు ఎంతమంది ఉన్నారో అంత మందికి సమాన వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామునాయక్, రామాంజనేయులు నాయక్, జయరాంనాయక్, వెంకటస్వామినాయక్, అనితబాయి, రంగస్వామి నాయక్, శ్రీనునాయక్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచండి

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన జేసీ నారపురెడ్డి మౌర్య


డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న జేసీ

కర్నూలు (అగ్రికల్చర్), జూన్ 28: డీసీఎంఎస్ ద్వారా ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఆ సంస్థ చైర్‌పర్సన్‌గా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసేందుకు సమాయత్తమయ్యారని, వారికి అన్ని రకాలుగా అండగా ఉండాలని, ఎంఆర్‌పీ ధరలకే అన్ని ఎరువులను అందించేందుకు చర్యలు తీసుకోవాలని మేనేజర్ రాజేష్‌కు ఆదేశించారు. డీసీఎంఎస్ సిబ్బంది రాజు, డీసీవో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

గూడూరు, జూన్ 28: గూడూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ దివాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్మన్ జె.వెంకటేశ్వర్లు ఆధ్యక్షతన జరుగుతుందని, కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

పచ్చదోమ నివారణపై నిర్లక్ష్యం వద్దు

సి.బెళగల్, జూన్ 28: పచ్చ దోమ నివారణపై రైతులు నిర్లక్ష్యం వహించొద్దని ఏవో మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోలకల్లు, ఇనగండ్ల గ్రామాల్లో పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విత్తనం నాటే సమయంలో నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. ఏవో వెంట సిద్దు, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలి

సి.బెళగల్, జూన్ 28: మండలంలో పింఛన్ల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శంకుతల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు పింఛన్ డబ్బులను డ్రా చేయడానికి బ్యాంకులకు తప్పసరి వెళ్లాలన్నారు. ఈసమావేశంలో ఈవోఆర్డీ సందీప్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి


మంత్రి టీజీకి వినతి పత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్

కర్నూలు(అర్బన్), జూన్ 28: సి.క్యాంప్ రైతు బజారులో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ సురేందర్ కోరారు. శుక్రవారంమంత్రి టీజీ భరత్‌ను కలిసి ఓ వినతి పత్రం ద్వారా విన్నవించారు. ప్రజలకు ఉపయోగపడే బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ త్వరలోనే అధికారులతో చర్చించి ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానన్నారని తెలిపారు.

గోకార్ బాషా మృతి పార్టీకి తీరని లోటు

ఓర్వకల్లు, జూన్ 28: మండలంలోని కాల్వ మాజీ సర్పంచ్ బాకర్ సాహెబ్ కుమారుడు, టీడీపీ నాయకుడు గోకార్ బాషా మృతి పార్టీకి తీరని లోటని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నం ద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం గోకార్‌బాషా అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, టీడీపీ నాయకులు ఖాదర్, రజాక్ బాషా పాల్గొన్నారు.

ఓర్వకల్లులో వేలం పాట

ఓర్వకల్లు, జూన్ 28: ఓర్వకల్లు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగే బండ్లమెట్టు రూములకు శనివారం ఉదయం 11 గంటలకు సచి వాలయం ఆవరణలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో ఆర్‌డీ సుబ్బరాయుడు శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనే బండ్ల మెట్లకు రూ.25వేలు ఒకటి నుంచి నాలుగు రూములకు ఒక్కొక్కటికి రూ.1,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పదోన్నతుల్లో అవకతవకలు

కల్లూరు, జూన్ 28: కర్నూలు డివిజన్ విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ల పదోన్నతుల్లో అవకతవకలు జరిగాయని 327-యూనియన్ డిస్కం అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్ అన్నారు. కర్నూలు డివిజన్‌లో అప్పటి డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పులు తడకగా జరిగిందన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగుల సంఖ్య ఉన్నా సంఖ్యను తగ్గించి రిజర్వేషన్ అమలు చేశారని ఆరోపించారు. విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదు కేసులు నమోదు

కర్నూలు, జూన్ 28: నగరంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి ఐదు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు ద్విచక్ర వాహనదారులు, ఒక ఆటో, ఒక కారు డ్రైవర్‌పై కేసులు నమోదు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా: కలెక్టర్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ ఎన్జీవోస్ జేఏసీ చైర్మన్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 28: ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని కలెక్టర్ రంజిత్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, ఏపీజేఏసీ చైర్మన్ వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు నూతన కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిలా కార్యదర్శి వి. జవహర్, కర్నూలు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, నగర కార్యదర్శి ఎం. రామక్రిష్ణ, రాష్ట్ర టైపిస్టు స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వరయ్య, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్, వెటర్నరీ లైవ్‌స్టాక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఉన్నారు. అలాగే కలెక్టర్‌కు ఎస్పీ కృష్ణకాంత్, జేసీ మౌర్య కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

● కలెక్టర్‌ను కలిసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల చైర్మన్ శ్రీరాములు, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు నూతన కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కరు ణానిధి మూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రామక్రిష్ణ, బుగ్గన రమణయ్య, రవీంద్రారెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ బాషాను లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయనను లయన్స్ జిల్లా చైర్మన్ లయన్ పి.వెంకటేశ్వర్లు, లయన్స్ అడిషనల్ క్యాబినెట్ కార్య దర్శి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, లయన్స్ ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిర్వహించే సామాజిక సేవ కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన హంసా నాయకులు

కర్నూలు(హాస్పిటల్): నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రంజిత్‌బాషాకు ఏపీ హంసా అసోసియేషన్ శుక్రవారం అభినందనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారం ఎంత అవసరమని, రోగు లకు మంచి సేవలు అందించాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హంసా అసోసియేషన్ చైర్మన్ రఘు బాబు, కర్నూలు సిటీ చైర్మన్ టి.గోవిందు, నగర నాయకులు మద్దూరు వెంకట స్వామి, కరుణానిధి, నాయకులు మాలిక్‌బాషా, సందీప్, త్యాగరాజు, సీవీ సత్యనారాయణ, సంపత్, లతీఫ్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



పీవీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్), జూన్ 28: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.బాబురావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు రాష్ట్రం, దేశంలో ఎన్నో కీలక పదవులు అలకంరించి, నంద్యాలలో ఎంపీ గా గెలుపొంది దేశా ప్రధాని పీఠం అదిరోహించారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటీ మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, పీసీసీ కార్యదర్శి దామో దరం రాధాకృష్ణ, అనంతరత్నం మాదిగ, బి.బతుకన్న, లాజరస్, బజారన్న, షేక్ ఖాజా హేస్సేన్, వెంకటలక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

తెలుగువారి ఘనత చాటిన పీవీ

కర్నూలు(కల్చరల్): భారత ప్రధాని హోదాలో తెలుగువారి ఘన కీర్తిని చాటిచెప్పిన మహనీయుడు పీవీ నరసింహారావు అని బ్రాహ్మణ సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ కొనియాడారు. శుక్రవారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని వివిధ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పీవీ నరసింహారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు టీవీ రవిచంద్రశర్మ, కొలుకుల నరేష్, సత్యం, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.







టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే


పల్లా శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్), జూన్ 28: అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యకుడు పల్లా శ్రీనివాస్‌ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈనేపథ్యంలో కోడు మూరు ఎమ్మెల్యే కొత్త అధ్యక్షుడిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ శాసన సభ్యులతో సమావేశం నిర్వహించి పరిచయం చేసుకున్నారు.

ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం


మాట్లాడుతున్న కేఈ మల్లికార్జునగౌడ్

కోడుమూరు, జూన్ 28: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటకు టీడీపీ కట్టుబడి ఉంటుందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పార్టీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి కోడుమూరు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారని అన్నారు. పట్టణ అధ్యక్షుడు ఎల్లప్ప నాయుడు, టీఎన్‌టీయూసీ నాయకులు గోపాల్ నాయుడు, బడె షాగౌడ్, పార్టీ నాయకులు హనుమంతప్ప, బ్రిటీష్‌రా ముడు, నారాయణ, బాల కిట్టు, రవీందర్‌గౌడ్, గిడ్డయ్య, మధు, కుమార్ పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

కల్లూరు, జూన్ 28: రైతులు మొక్కజొన్న, నూనేగింజల యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఏ.మాధురి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం కొంగనపాడులో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీడీఏ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

పార్క్‌ను కాపాడాలి

కల్లూరు, జూన్ 28: కార్పొరేటర్ అనుచరుడు కబ్జా నుంచి సుందరయ్య పార్క్‌ను నగరపాలక సంస్థ అధికారులు కాపాడాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు శుక్రవారం 19వ వార్డు సోమిశెట్టి ఎస్టేట్‌లోని శిథిలావస్థకు చేరిన పార్క్ వద్ద పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు టి.హరికృష్ణ, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ల్యాప్‌ట్యాప్ దొంగ దొరికాడు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 28: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాల్టీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న పీజీ విద్యార్థి అనంతనాగ్ ల్యాప్ ట్యాప్ బుధవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. గురువారం వైద్య విద్యార్థి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు హాస్పిటల్‌లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించి దొంగను గుర్తించారు. బుధవారపేటకు చెందిన హెబ్బేజార్ అనే దొంగ క్యాజువాల్టీలో రోగిలా వచ్చి వైద్య విద్యార్థి ల్యాప్ ట్యాప్‌ను తన బ్యాగులో పెట్టుకుని జీవనధార మెడికల్ షాపు ఎదురుగా ఉన్న రెండో గేటు ద్వారా బయ టకు వెళ్లాడు. ఇవన్నీ సీసీ కెమెరాలో బయటపడ్డాయి. దొంగను గుర్తించి బుధవారపేటలో పట్టుకుని ల్యాప్‌ట్యాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ల్యాప్ ట్యాప్‌ను వైద్యవిద్యార్థి అనంతనాగ్‌కు అప్పగించినట్లు తెలిపారు. 24 గంటల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులను జూనియర్ డాక్టర్లు అభినందించారు. ఇటీవల ఆసుపత్రిలో దొంగతనాలు మితీమీరుతున్నాయని, బాత్‌రూమ్‌లో కూడా కొళాయిలు చోరీకి గురవుతున్నాయని సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పల్లాకు మాజీ మంత్రి కేఈ అభినందనలు

కర్నూలు(అర్బన్), జూన్ 28: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యకుడిగా పల్లా శ్రీనివాస్‌ను నియమించడం అభినందనీయమని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలోకి టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ బాధ్యతలు తీసుకుంటున్న సమయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి అభినందించారు. కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యాదర్శి కాసాని మహేస్ గౌడ్, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

● యాదవులకు సముచితస్థానం కల్పించారు.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి యాదవ సామాజిక వర్గానికి కేటాయించడం అభినందనీయమని రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరావు యాదవ్ అన్నారు. శుక్రవా రం మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న అనంతరం పల్లా శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

కర్నూలు(కల్చరల్), జూన్ 28: విద్యార్థులు చదువులో రాణించాలని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి 90 శాతం హాజరు కలిగి ఉండాలని సూచించారు. కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూన్ 28: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1న ఉదయం 6 గంటల నుంచి ఈ ప్రక్రియకు సంబంధించి సచివాలయ కార్యదర్శుల ద్వారా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో 50 మంది పింఛను లబ్ధిదారులకు ఒక నగర పరిధిలో అన్ని విభాగాలకు సంబం ధించి 26 రకాల పింఛన్లను పంపిణీ చేయనున్నమన్నారు. మొత్తం 33,751 మంది లబ్ధిదారులకు రూ.23,20,41,500 పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించామని ఆయన పేర్కొన్నారు.

నిధులు విడుదల చేయాలి: సీఐటీయూ


ఉప కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 28: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ దరఖాస్తుల నిధులను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే.సుధాకరప్ప కోరారు. శుక్రవారం కార్మిక శాఖ కార్యాల యంలో ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకరప్ప మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వం జీవో 17 తీసుకువచ్చి కార్మికులు దాచుకున్న సొమ్ము రూ.835 కోట్లు వివిధ పథకాలను దారి మళ్లించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇసుక ధర విపరీతంగా పెంచడం వల్ల ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేసి కార్మికులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్ర మంలో కార్యదర్శి ఖాజాపాషా, నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు, నాగరాజు, జి.ఏసు, మౌలాలి పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 28: ప్రతి శుక్రవారం ప్రజలు డ్రై డే పాటిస్తే సీజనల్ వ్యాధులు దూరమవుతాయని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ అన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, ఆరోగ్య సహాయకులతో టెలికాన్ఫరెన్సు ద్వారా కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర వ్యాప్తంగా తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి పాత టైర్లు, బాటిళ్లు, కొబ్బరి బొండాలు, ఎయిర్ కూలర్లు, డబ్బాలు, పూలకుండీలు వంటి వాటిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. నీటి నిల్వల వల్లనే లార్వాలు పెరిగి దోమలు ప్రబలుతున్నాయనే విషయాన్ని ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

పంచాయతీ నిధులపై విచారణ జరిపించాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 28: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించిన అధికారులపై విచారణ జరిపించాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రుప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దారి మళ్లించిన రూ.8629 కోట్లను తిరిగి పంచాయతీలకు అప్పజెప్పాలని ఆయన ఆ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌ను కోరారు.

మెనూ ప్రకారంగా భోజనం అందించాలి

సి.బెళగల్, జూన్ 28: మెనూ ప్రకారంగా భోజనం అందించాలని మండల విద్యాధికారి ఆదాంబాషా వంట ఏజెన్సీలకు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో, రెగ్యులర్, ఉన్నత పాఠశాలలోను మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారంగా బోజనం అందించని వంట ఏజెన్సీలను తొలగించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఎంఈఓ వెంట హెచ్ఎం కిశోర్ ఉన్నారు.

వడివడిగా అడుగులు

- హామీల అమలు దిశగా పాలన
- పేదలు, రైతులు, నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 28: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి కొలువు తీరిన టీడీపీ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి అడుగు వేశారు. రాష్ట్ర క్యాబినెట్ హామీలపై ఆమోదం తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడి చేసినా నోటిఫికేషన్‌తో డీఎస్సీ ఆగిపోయింది. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకం డీఎస్సీపై చేశారు. దీంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్న క్యాంటీన్లు

పేదలకు తక్కువ ధరకే భోజనం అందించాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. రాష్ట్రంలో 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీ పడకుండా పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అన్న క్యాంటీన్ల ద్వారా అందించారు. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉద్దేశంతోనే అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.5కే అందించారు. ప్రతి రోజూ ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం ప్రజలకు అందుబాటులో ఉండనున్నది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు పేరు మీద టీడీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా 2018 జూన్ 11న ఏర్పాటు చేసింది. అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం అక్షయపాత్ర అనే స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు దాదాపు 2.25 లక్షల మంది, రాష్ట్ర వ్యాప్తంగా 7.25 కోట్ల మంది ఆకలిని తీర్చేలా అన్నా క్యాంటీన్లు పని చేశాయి. ఒక్క క్యాంటీన్‌లో ఉదయం 300 మందికి అల్పాహారం, మధ్యాహ్నం 360 మందికి, రాత్రి 250 మందికి ప్రతి రోజూ రూ.5కు నాణ్యమైన భోజనం అందించారు. ఇలా పేదలకు కడుపునిండా అన్నం పెట్టే క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేయించింది. తిరిగి ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి.



ఎన్టీఆర్ భరోసా పథకం



వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితర పింఛన్ల మొత్తాన్ని రూ.3వేలు నుంచి రూ.4వేల వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.వెయ్యి చొప్పున రూ.4వేలు కలిపి మొత్త రూ.7వేలు జూలై 1వ తేదీన సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దనే అందజేస్తారు. దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్థులకు ఇస్తున్న పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. దివ్యాంగులకు రూ.5 వేలు, కిడ్నీ బాధితులకు రూ.15 వేలు, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.5వేల నుంచి రూ.10వేలు ఇవ్వనున్నారు. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,26,152, వితంతు 71,519, వికలాంగుల పింఛన్లు 31,510, చేనేత కార్మికులు 2,948, కల్లుగీత కార్మికులు 242, హిజ్రాలు 241, ఒంటరి మహిళలు 5,883, మత్స్య కార్మికులు 817, సీకేడీయూ (ప్రభుత్వం) 127, సీకేడీయూ (ప్రైవేటు) 245, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు 787, డప్పు కళాకారులు 1,457, చర్మకారులతోపాటు 1,142, సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు 6, కళాకారుల పింఛన్లు 39, అభయ పింఛన్లు 2,572 ఉన్నాయి.

2,678 టీచర్ పోస్టులు



జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా 2,678 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి. ఇందులో 1,801 సెకండరీ గ్రేడ్ టీచర్లు, మిగతా తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం త్వరలో టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనున్నది. ఇటీవల బీఎడ్, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికి, గతంలో టెట్ అర్హత పొందలేని వారికి ఒక సువర్ణ అవకాశం కల్పించనున్నది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక డీఎస్సీ కూడా నిర్వహించలేదు. డీఎస్సీలో 20 శాతం టెట్ వెయిటేజీ ఇవ్వనున్నారు.

నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం

స్కిల్ ప్రొఫైల్స్, స్కిల్ నీడ్స్, స్కిల్ ఇన్ డిమాండ్, స్కిల్ లభ్యత మధ్య అంతరాన్ని గుర్తించడం, అంచనా వేయడం, తదనుగుణంగా నైపుణ్య అభివృద్ధి శిక్షణలో డిజైన్ చేసేలా ప్రభుత్వానికి సమాచారం అందించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలో నైపుణ్యాలు లేకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోయింది. నైపుణ్యాలు పెంపొందించి విద్యార్థులకు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన ఉద్దేశం.



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు

రిజిస్ట్రేషన్, రెవెన్యూ న్యాయ వ్యవస్థలను అస్తవ్యస్తంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్టును టీడీపీ ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. తరతరాల నుంచి వస్తున్న భూమి పాస్ పుస్తకంపై, సర్వే రాళ్లపైన జగన్ బొమ్మ వేశారు. నీతి అయోగ్ ప్రతిపాదించిన నమూనా చట్టానికి జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టానికి అసలు ఏ మాత్రం సంబంధం లేదు. భూ వివాదాలపై జిల్లా కోర్టులు, సివిల్ కోర్టులకు పరిధి లేకుండా చేసి హైకోర్టును మాత్రమే ఆశ్రయించేలా ఈ చట్టం తెచ్చారు. సన్న, చిన్న కారు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 28: మెగా డీఎస్సీ (ఎస్‌జీటీ) కోసం ఉచిత శిక్షణ కావాలని అనుకొనే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి, ఏపీబీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన డీఈడీ, టీటీసీ, ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను కర్నూలు అబ్బాస్‌నగర్, కల్లూరు ఎమ్మార్వో ఆఫీసు ఎదురుగా ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చి జూలై 10వ తేదీలోపు సమర్పించాలన్నారు. అభ్యర్థుల ఎంపిక డీఈడీ మెరిట్ ఆధారంగా జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కర్నూలు బీసీ స్టడీ సర్కిల్‌లో 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని అన్నారు. వివరాల కోసం 08518-236076 నెంబరులో సంప్రదించాలన్నారు.

పెద్దాసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రీ తప్పనిసరి

వైద్యులు, పారా మెడికల్ నర్సులు హాజరు వేయాల్సిందే

కర్నూలు(హాస్పిటల్), జూన్ 28: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది పని వేళలు పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రీ తప్పక వేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది డ్యూటీ వేళల ప్రకారం సమయానికి ముఖ హాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయాలన్నారు. వైద్యులు, సీఎస్ఆర్ఎంవో, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో, ఏఆర్ఎంవో, మెడికల్ ఆఫీసర్లు (స్టోర్) హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాస్పిటల్‌లో అందు బాటులో ఉండాలన్నారు. మినిస్ట్రీరియల్ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలన్నారు. నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు తమ షిఫ్ట్ ప్రకారం రోజుకు 3సార్లు తమ హాజరును సమర్పించాలని అధికారులు, హెచ్‌వోడీలను ఆదేశించారు. హౌస్ సర్జన్లు, డ్యూటీ డాక్టర్లు షిఫ్టుల ప్రకారం ముఖ హాజరు ఎఫ్ఆర్ఎస్ సమయానికి సమర్పించాలని, లేకపోతే జీతంలో కోత విధిస్తామని హెచ్చరించారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

- కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తాం
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రంజిత్‌బాషా



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 28: ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఉదయం 10:15 గంటలకు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కర్నూలు తనకు సొంత జిల్లాలాగా ఉందన్నారు. స్వస్థలం నందికొట్కూరు నియోజకవర్గం అని, తన విద్యాభ్యాసం కొంత వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే జరిగిందన్నారు. దాదాపు 20 సంవత్సరాల కిందట ఉద్యోగ రీత్యా కర్నూలు జిల్లాను విడిచి వెళ్లానని అన్నారు. మరలా ఇప్పుడు కలెక్టర్‌గా సొంత జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యచరణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేస్తానన్నారు. జిల్లా ప్రజలందరికీ మేలు చేకూరే విధంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరుపున తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటాననీ స్పష్టం చేస్తా అన్నారు. అనంతరం నూతన కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు తదితరులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న జేసీ

బీహార్ మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల, జూన్ 28: కర్నూలు రహదారిలోని అయ్యలచెరువు ప్రాంతంలో ఉన్న ఒక పాలిష్ ఫ్యాక్టరీలో పని చేసే బీహార్‌కు చెందిన గురూజీ సింగ్ భార్య నేహ కుమారి పాండే (23 ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా శుక్రవారం సాయంకాలం వెలుగులోకి వచ్చింది. నేహా కుమారి పాండేకు, గురూజీసింగ్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ 24న వివాహమైంది. అతనిది బీహార్ రాష్ట్రం సారెన్ జిల్లా పటేల్ గ్రామం. అయితే బతుకుతెరువు కోసం అతను బేతంచర్ల శ్రీనివాసరెడ్డి నాపరాళ్ల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. నేహ కుమారి పాండే మూడు రోజుల క్రితం బేతంచెర్లకు వచ్చింది. గురువారం సాయంత్రం ఆమె ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై పోలీసులను అడుగగా తమకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు.

ఫ్లెక్సీ చించారని కేసు నమోదు

కర్నూలు, జూన్ 28: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో మంత్రి పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీ చించివేయడంతో కేసు నమోదైంది. ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి మంత్రి పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని చెక్‌పోస్టులో ఏర్పాటు చేశారు. డేవిడ్ అనే వ్యక్తి ఈ ఫ్లెక్సీ చించడంతో ప్రవీణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

జడ్పీలో ఎన్నికల వేడి..

- రెండువర్గాలుగా ఉద్యోగులు
- పంతం నెగ్గించుకునేందుకు పట్టుబడుతున్న ఓ వర్గం ఉద్యోగులు




కర్నూలు(న్యూసిటీ), జూన్ 28: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు జిల్లా పరిషత్‌లో త్వరలో జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని తాలూకా యూనిట్ల ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు నిర్వహించేందుకు సంఘం నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే గత కాలంగా జడ్పీ యూనిట్‌లో రెండు వర్గాలుగా ఉద్యోగులు విడిపోయారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండంతో ఎన్నికల వేడి మొదలైంది. ఇరువర్గాలు తమ పంతం నెగ్గించుకునేందుకే పావులు కదుపుతున్నారు.

ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు ఎన్నికల బరిలో

యూనిట్ పరిధిలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు ఎలాగైన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కొందరు ఉద్యోగులు దీనిని అడ్డుకుంటున్నారు. దీంతో అసలు కథ ఇక్కడే మొదలైంది. ఐదు సంవత్సరాలు పూర్తి కాని వారు మాత్రమే పోటీ చేయాలని కొందరు అంటుంటే..లేదు ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు కూడ పోటీ చేయవచ్చని మరో వర్గం భీష్మించుకుని ఉంది. దీంతో రెండువర్గాల మధ్య వైరం నెలకొంది.

చక్రం తిప్పుతున్న ఓ అధికారి..

ఎంతో కాలంగా జిల్లా పరిషత్ యూనిట్ పరిధిలో పని చేస్తున్న ఓ అధికారి దీనంతటికీ చక్రం తిప్పుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు ఇప్పటికే అన్ని తాలూకాలలో ఎన్నికలు ముగిశాయి. చివరికి మిగిలింది జిల్లా పరిషత్ యూనిట్ మాత్రమే. ఇది పూర్తయిన వెంటనే జిల్లా ఎన్నికలను నిర్వహించుకోవాలి. దీంతో జడ్పీ యూనిట్ ఎన్నికలపైనే ప్రతి ఒక్కరి దృష్టి పడింది. దీంతో పాటు ఎన్నికల పోలింగ్ సెలవురోజుల్లో కాకుండా పని రోజుల్లోనే నిర్వహించుకోవాలని ఓ వర్గం ఆలోచిస్తుంది. అయితే పని రోజుల్లో కాకుండా కేవలం సెలవురోజుల్లోనే ఎన్నికలు జరపాలని మరో వర్గం పట్టుబట్టింది. అయితే మొత్తం యూనిట్ పరిధిలో 114 మంది ఓటర్లు ఉండగా ఇందులో సుమారు 70 మందికి పైగా సెలవురోజుల్లో ఎన్నికలు నిర్వహించరాదని...కేవలం పనిరోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని సంతకాలు చేశారు. వారానికి ఒక్కరోజు వచ్చే సెలవు రోజు కూడ ఇంట్లో గడపకుండా కార్యాలయానికి వస్తే ఎలా అని కొందరు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. దీంతో జిల్లా పరిషత్ యూనిట్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది రాష్ట్ర మినిస్టీరియల్ ఎన్నికల సంఘం నాయకుల వద్ద పంచాయతీకి చేరింది.



తెలంగాణ మద్యం బాటిళ్లు సీజ్



మద్యం బాటిళ్ల రవాణా కేసులో నిందితులతో సెబ్ అధికారులు

కర్నూలు(అర్బన్), జూన్ 28: తెలంగాణ నుంచి జిల్లాలోకి తరలిస్తున్న 215 మద్యం బాటిళ్లు సీజ్ చేశామని సెబ్ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్దపాడు వద్ద పెద్దకొట్టాలకు చెందిన షేక్షావలి నుంచి 144, దూపాడు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ నుంచి 71 తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐ రెహనాబేగం, మారుతి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

మంత్రాలయం, జూన్ 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం నెల్లూరు జిల్లా కావలి టీడీపీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ అశోక్ కినగి, రాయచూరు జిల్లా ఏఎస్పీ హరీష్ కుటుంబ సమేతంగా శుక్రవారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తిలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. హైకోర్టు జడ్జి శుక్రవారం రాత్రి మంత్రాలయంలో బస చేసి శనివారం రాఘవేంద్రస్వామిని దర్శించుకోనున్నారు. వీరి వెంట ఏఏఓ మాధవశెట్టి, మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్ సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.



బంగారు పల్లకి మోస్తున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

బాబా బృందావన్ నగర్‌లో చోరీ

కర్నూలు, జూన్ 28: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబా బృందావన్ నగర్‌లో భారీ చోరీ జరిగింది. శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇంట్లో దొంగలు నగదు, బంగారు నగలు అపహరించారు. కొలిమిగుండ్ల మండలానికి చెందిన ఈయన వృత్తిరీత్యా రైతు. కర్నూలులో స్థిరపడ్డాడు. కొడుకు, కూతురు అమెరికాలో ఉంటుండగా.. భార్యాభర్తలు ఇద్దరూ బాబా బృందావన్ నగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 19వ తేదీన సొంత పని నిమిత్తం కొలిమిగుండ్లకు వెళ్లారు. తిరిగి శుక్రవారం కర్నూలు వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసి నిర్ఘాంతపోయారు. బీరువా అంతా చిందర వందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం రాత్రి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. 45 తులాల మేర బంగారు ఆభరణాలు, కిలో వెండి, టీవీ, కొంత నగదును అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. క్లూజ్ టీమ్‌లు వివరాలు సేకరిస్తున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- ఎమ్మెల్యే బీవీకి శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిల్
- మిఠాయిలు పంచిన టీడీపీ కౌన్సిలర్లు
- సమస్యలపై సభ్యుల ఏకరువు


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్

ఎమ్మిగనూరు, జూన్ 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల తరువాత జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం సాదాసీదాగా జరిగింది. చైర్మన్ రఘు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలో ప్రవేశపెట్టిన పలు అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వీజీపీ దయాసాగర్, కౌన్సిలర్ రామదాసు గౌడ్ సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీవీ జయనాగేశ్వరరెడ్డికి కౌన్సిల్, పట్టణ ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చైర్‌పర్సన్ డా. రఘు రాష్ట్రంలో ఎంపికైన కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, కౌన్సిలర్లు నాగేశప్ప కొత్త ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్లు చైర్మెన్, వైస్‌చైర్మన్, సభ్యులకు మిఠాయిలు తినిపించారు. అలాగే మిగతా సభ్యులకు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

● **మీరు సహకరిస్తే మేము సహకరిస్తాం: వైస్ చైర్మన్ నజీర్**

కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ నజీర్ మట్లాడుతూ కౌన్సిల్‌లో మాకే బలం ఉందన్నారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములను సమానంగా తీసుకొని అభివృద్ధికి సహకరించాలన్నారు. మీరు మాకు సహకరిస్తే.. మీకు మేము సహకరిస్తామని.. టీడీపీ సభ్యులను ఉద్దేశించి పేర్కొనడం గమనార్హం.

● **సమస్యలపై సభ్యుల ఏకరువు:** కౌన్సిల్ సమావేశంలో కొంత మంది సభ్యులు తమవార్డులో సమస్యలను ఏకరువు పెట్టారు. వెంకటాపురం కాలనీలో విద్యుత్ స్తంభం, తాగునీటి పైప్‌లైన్ మార్చాలని ఆవార్డు కౌన్సిలర్ బజారి చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఒకటో వార్డు కౌన్సిలర్ నాగేశప్ప మాట్లాడుతూ తేరుబజారులో మంచినీటి బోరు, వార్డులో మూడు చోట్లు సీసీ రోడ్లు వేయాలని కోరారు. అలాగే కౌన్సిలర్లు శివకుమార్, కేశవరెడ్డి తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఇందుకు కమిషనర్ గంగిరెడ్డి స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, వైస్‌చైర్మన్ దివ్వకళ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటి బిల్లులు ఇవ్వరా..?

● ఎన్టీఆర్ గృహాలకు అందని బిల్లులు ● ఆందోళనలో లబ్ధిదారులు

తుగ్గలి, జూన్ 28: తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన ఎన్టీఆర్ గృహాలకు గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదని, ఇప్పుడైనా బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు రాజునాయక్, రమేష్‌నాయక్, సుజాత, శంకరమ్మ కోరారు. శుక్రవారం వారు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఎల్లమ్మగుడి తాండలో టీడీపీ ప్రభుత్వంలో 2018-19 సంవత్సరంలో 11 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ గృహాలు మంజూరై బేసిమట్టం బిల్లులు ఒక్కొక్కరికి రూ.25వేలు బిల్లులు చెల్లించారు. మరొకరికి రూపాయి బిల్లు మాత్రమే వచ్చింది. అయితే.. 2019 నుంచి బిల్లులు చెల్లించాలని అధికారులను, నాయకులను కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. పత్తికొండ ఎమ్మెల్యే స్పందించి తమకు బిల్లులు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మానాయక్, ఉమ్లా నాయక్, బాలు నాయక్, జాలుబాయి తదితరులు ఉన్నారు.


బిల్లుల కోసం నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

బీసీలకు టీడీపీలో పెద్దపీట

● టీడీపీ నేత వీరభద్ర గౌడ్


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ను కలిసిన వీరభద్ర గౌడ్

ఆలూరు, జూన్ 28: టీడీపీలోనే బీసీ వర్గాలకు అధిక సంఖ్యలో పదవులు ఇచ్చి గుర్తింపు లభిస్తుందని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తాం


ఫిల్టర్ బెడ్ మరమ్మతులు పరిశీలిస్తున్న ఏఈ

కౌతాళం, జూన్ 28: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని కౌతాళం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య తెలిపారు. కౌతాళం దగ్గర ఉన్న ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి సరఫరా చేస్తున్న మంచి నీటిలో క్రిములు వస్తున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ట్యాంకును శుక్రవారం పరిశీలించారు. దాదాపు 15మందితో ఇసుక తీత పనులు చేస్తున్నామని శనివారం సాయంత్రానికి ఫిల్టర్ బెడ్ మరమ్మతుల పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధమైన నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని తెలిపారు.

లక్ష్మమ్మ అవ్వ బ్యాంకు నికర లాభం రూ..2కోట్లు



మాట్లాడుతున్న సుబ్బయ్య

ఆదోని టౌన్, జూన్ 28: మహాయోగి లక్ష్మమ్మ అవ్వ ఈ ఏడాది రూ. రెండు కోట్ల నికర లాభం వచ్చినట్లు బ్యాంక్ చైర్మన్ రాచోటి రామయ్య అన్నారు. శుక్రవారం బ్యాంకు యాన్యువల్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, తమ బ్యాంకుపై ప్రజలకు ఉన్న నమ్మకంతో రూ.266 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందించారని అన్నారు. వివిధ రుణాల కింద ప్రజలకు ఈ ఏడాది రూ.173 కోట్లను ఇవ్వడం జరిగిందన్నారు. తమ బ్యాంకు షేర్ హోల్డర్‌లకు 8.5 శాతం డివిడెంట్‌గా అందించడం జరుగుతోందన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆర్ సుబ్బయ్య, బ్యాంక్ సీఈవో గట్టు మురళి కుమార్, డైరెక్టరులు, షేర్ హోల్డర్లు పాల్గొన్నారు.

భవిష్యత్తుపై విద్యార్థి దశ నుంచే ప్రణాళిక అవసరం


మాట్లాడుతున్న ట్రైనీ ఐఆర్ఎస్ సమీర్ రాజా

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 28: విద్యార్థి దశ నుంచి ప్రణాళిక అవసరమని ట్రైనీ ఐఆర్ఎస్ అధికారి సమీర్ రాజా అన్నారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గ్రూప్ సర్వీస్ పరీక్షలపై వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనిషికి క్రమశిక్షణ, పట్టుదల అవసరమన్నారు. ఏకాగ్రత ఉంటే విజయాన్ని సునాయాసంగా అందుకోవచ్చన్నారు అనంతరం ఆయనని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ రెడ్డి అధ్యాపకులు అయ్యప్ప, బాలస్వామి, ఇందిరా, హనుమంతప్ప, యుగంధర్ రెడ్డి, రంగనాథం, నళిని, మధు లక్ష్మణ్ పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్టాండులో సంచరిస్తున్న ఆవులు

పశువుల నిలయంగా ఆర్టీసీ బస్టాండు

మంత్రాలయం, జూన్ 28: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మంత్రాలయం ఆర్టీసీ బస్టాండు పశువులకు, ఆవులకు, కుక్కలకు, పందులకు నిలయంగా మారింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర భక్తులతో, ఇతర గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులతో మంత్రాలయం బస్టాండు సందడిగా ఉంటుంది. పశువులు, కుక్కలు, పందులు ఇతర తినుబండారాల సంచులపై దాడి చేస్తున్నాయి. ప్లాట్ ఫారాలపై మూగజీవాలు సంచరిస్తుండటంతో భక్తులు ఆర్టీసీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు విశాలంగా ఉండాల్సిన బస్టాండు ప్రాంగణం వారి టెండర్ల దుకాణాల కంటే సగానికి పైగా ప్రాంగణాన్ని ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో ఆర్టీసీ ప్రాంగణం ఇరుగ్గా మారింది. దీనికి తోడు పరిసరాలు చెత్తా చెదారంతో నిండి ఉండటం, దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు దృష్టి సారించి మూగజీవాలను అరికట్టి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని కోరుతున్నారు.

వీఆర్‌ఏలకు అందని అలవెన్సు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ఎమ్మిగనూరు, జూన్ 28: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన వీఆర్‌ఏ(తలారులు)లకు ఎన్నికల బత్తా రోజులు గడుస్తున్నా అందటం లేదు. దీంతో నెల రోజులుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. బత్తాలు ఇప్పించాలని స్థానిక రెవెన్యూ అధికారులను కోరినా ఇదిగో అదిగో అంటు కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. ఎమ్మిగనూరు మండలంలో 44 మంది వీఆర్‌ఏలు ఉన్నారు. వీరు ఎన్నికల సందర్భంగా స్థానిక అధికారుల ఆదేశాల మేరకు వివిధ రకాల పనులు నిర్వర్తించారు. దాదాపు మూడు నెలల పాటు స్థానిక రెవెన్యూ అధికారులు చెప్పిన పనులన్నీ చేశారు. చివరకు బత్తా రాకపోవడంతో తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన బీఎల్‌ఓలకు మాత్రం రెండు వారాల క్రితమే బిల్లులు చెల్లించి వీఆర్‌ఏలకు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిరుద్యోగులైన వీఆర్‌ఏలకు రావాల్సిన బత్తాలను ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● **జీతాలు అందని దైన్యం..**

వీఆర్‌ఏలకు సంబంధించిన మే నెల జీతభత్యాలు సైతం అందలేదు. దీంతో వీరు అటు బత్తా కోసం, ఇటు జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ప్రతి నెలా 25వ తేదీ బిల్లు పెడితే తిరిగి మరుసటి నెల ఐదో తేదీ లోపు వీఆర్‌ఏల బ్యాంకు అకౌంట్‌లోకి డబ్బులు జమ అవతాయి. అయితే అయితే గత నెలలో జీతాల బిల్లు ఆలస్యంగా పెట్టడంతో నేటికి వీఆర్‌ఏలకు జీతాలు అందలేదని వాపోతున్నారు. జీతం అంతంత మాత్రంగానే వస్తుండటంతో కొంతమంది వీఆర్‌ఏల జీవనం దుర్భరంగా ఉంటుందని, అలాంటి చిరుఉద్యోగుల పట్ల స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● **వివరణ:** ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ శేషారెడ్డిని వివరణ కోరగా వీఆర్‌ఏల ఎన్నికల బత్తా బడ్జెట్ రాలేదు. వచ్చిన వెంటనే వారికి పంపిణీ చేస్తాం. జీతాల కోసం కూడా రాసి పంపాం. జీతాలు నేరుగా వీఆర్‌ఏలకు ఖాతాల్లోనే జమ అవుతాయి. వాటిలో మా ప్రమేయం ఏమీ ఉండదు.

చంద్రబాబు రాకతో టిడ్కో గృహాలపై ఆశలు

ఆదోని టౌన్, జూన్ 28: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో టిడ్కో గృహాలపై లబ్ధిదారులకు ఆశలు చిగురించాయని జంగమ వీరశైవ హక్కుల పోరాట సమితి నాయకులు యడవల్లి మంజునాథ్, ఎండీ బద్రీనాథ్ స్వామి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో పేదల కోసం నిర్మించిన టిడ్కో పక్కా గృహాలు వైసీపీ ప్రభుత్వం రావడంతో వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ఆపేయడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పక్కాగృహాల కోసం రూ.లక్ష దాకా డీడీ రూపంలో చెల్లించిన లబ్ధిదారులు అటు గృహాలు చేతికి రాక, ఇటు ఇల్లకు అద్దెలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతూ వచ్చారని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వెంటనే టిడ్కో గృహాలలో మిగిలిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి పంపిణీ చేయాలని కోరారు. మోహన్ బాబు, వెంకటరాముడు, నందకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదోని డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాలి

ఆదోని టౌన్, జూన్ 28: పూర్తిస్థాయిలో వెనుకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్‌ను జిల్లాగా ప్రకటించాలని మైనారిటీల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి, ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన జిల్లాల విభజన ప్రక్రియలో ఆదోని ప్రాంతానికి పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆదోని జిల్లాను ప్రకటించి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వేతనాలు అందించేందుకు చర్యలు

హాలహర్వి, జూన్ 28: ఉపాధి హామీ పథకంలో బకాయి వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆంథోని తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారని, కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని చెప్పారని అన్నారు. జూలై మొదటి వారంకల్లా కూలీల వేతనాలు అందజేస్తామని తెలిపారు.

విచారించి కులధ్రువీకరణ పత్రం అందజేస్తాం

మద్దికెర, జూన్ 28: మండలంలో కులధ్రువీకరణ పత్రం కోసం చాలా మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, విచారణ చేసి కుల ధ్రువీకరణపత్రం అందజేస్తామని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎన్నికల కోడ్ రాకముందు ఆన్‌లైన్ ద్వారా దాదాపు 4వేల మంది దాకా కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వెంటనే అందరికీ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని తెలిపారు.

ముగిసిన పంచాయతీ వేలం పాటలు

కౌతాళం, జూన్ 28: కౌతాళం మేజర్ పంచాయతీకి నిర్వహించిన వివిధ రకాల వేలం పాటలను శుక్రవారం గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బండిమెట్ట వేలం పాట గ్రామానికి చెందిన కె. భీమయ్య రూ.2,25,500కు కైవసం చేసుకోగా, దినసరి కాయగూరల మార్కెట్‌ను ఎరిగేరి మాబమ్మ రూ. 13,000కు దక్కించుకున్నారు. అయితే ఈ సారి 9నెలలు మాత్రమే వేలం పాటలు నిర్వహించగా ఆదాయం తగ్గిందని, ఈ వేలం పాటలు జూలై 1 2024 నుంచి మార్చి 30, 2025 వరకు 9నెలలు అమలులో ఉంటుందని కార్యదర్శి శివప్ప తెలిపారు.

హామీని నెరవేర్చిన చంద్రబాబు

మద్దికెర, జూన్ 28: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని టీడీపీ నాయకులు మెడికల్ తిమ్మప్ప, బసినేపల్లి తిమ్మప్ప, హరినాథ్‌గౌడు అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో వారు మాట్లాడుతూ 1న పింఛనదారులకు ఇంటింటికి వచ్చి పింఛన్లు అందించడం జరుగుతుందని తెలిపారు.

మట్టి నమూనా సేకరించాలి

మద్దికెర, జూన్ 28: మండలంలోని సాగులో ఉన్న వ్యవసాయ పొలాల్లో మట్టి నమూనాలు సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారి యు.రవి తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వారంలో ప్రతి గ్రామం నందు మట్టి నమూనాలు సేకరించి వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఆనంద్ నాయక్, జాకీర్, రాణి, కవిత తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మద్దికెర, జూన్ 28: స్థానిక జెండాకట్ట వీధికి చెందిన టైలర్‌వలి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. సీనియర్ టీడీపీ నాయకులు, మండల టైలర్ల సంఘం అధ్యక్షుడు రఘు యాదవ్, మండల టీడీపీ నాయకులు టైలర్ హరి ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టైలర్లు చాంద్‌బాషా, రామాంజులు, అస్లాం, శేఖర్ ఉన్నారు.

బాలికల వసతి గృహానికి ఆట వస్తువుల విరాళం

వెల్దుర్తి, జూన్, 28: స్థానిక బీసీ బాలికల వసతి గృహానికి 1989-90 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు క్యారమ్ బోర్డు, చెస్, బాల్స్, రోప్స్ తదితర వస్తువులను వార్డెన్ శైలజకు శుక్రవారం అందజేశారు. విద్యార్థులకు చదువుతోపాటు మానసికోల్లాసం కోసం ఆటలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో హిందీ పండిట్ గఫూర్, ఎస్టీ ఖాజాహుస్సేన్, శ్రీనివాసులు, వడ్ల మహేష్, శివరామిరెడ్డి, భాస్కర్‌గౌడు, మురళీధర్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, సంజీవరెడ్డిలు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి


మంత్రిని సత్కరిస్తున్న నాయకులు

ఆదోని, జూన్ 28: వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని హోం మంత్రి అనిత వంగలపూడికి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మారుతి నాయుడులు కోరారు. శుక్రవారం విజయవాడలో మంత్రిని కలిసి, ఆదోని మహాయోగి లక్ష్మమ్మవ్వ ఫొటోను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆదోని వైసీపీ పాలనలో ఇబ్బందుల పడ్డ కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని, ఏవైనా అక్రమ కేసులు, సమస్యలు ఉంటే తీరుస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వినయ్, వెంకట్రాం, జేపీ వెంకటేష్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 28: ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ముఖ్యనాయకులు సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీలో అన్యాయం జరిగిందని, బాధ్యతలు చేపట్టిన సీఎం చంద్రబాబు నాయుడు పీఆర్సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య కనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. సమావేశం నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, భీమరాజు, జంబులయ్య, శ్రీనివాస్, అబిదా బేగం అహ్మద్ హుస్సేన్ శ్రీరాములు జయరాం పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామ పంచాయతీలో వేలాలు

పత్తికొండ టౌన్, జూన్ 28: పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీలో ఏటా నిర్వహిస్తున్న వేలాలను అధికారులు శుక్రవారం నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొమ్ముదీపిక అధ్యక్షతన డీఎల్‌పీవో ప్రకాష్‌నాయుడు, ఈవో నరసింహులు వేలాలను నిర్వహించారు. అయితే.. గత ఏడాది ఆర్టీసీ బస్టాండు వేలం నిర్వహణకు రూ.13లక్షలపైచిలుకు వేలం దక్కించుకోగా ఈసారి ఆ మొత్తాన్ని పాటాదారులు ఆసక్తి చూపకపోవడంతో అందుకు సంబంధించి బస్టాండు వేలాన్ని వాయిదా వేశారు. దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, జంతు వధశాలలకు వేలాలు నిర్వహించగా.. పలువురు పాటాదారులు వాటిని దక్కించుకున్నారు. పత్తికొండ ఆర్టీసీ బస్టాండుకు సంబంధించిన వేలం శనివారం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని తెలిపారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి


ప్రజలతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

దేవనకొండ, జూన్ 28 : ప్రజలు అంటువ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, సీహెచ్‌వో భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని వరిముక్కల గ్రామంలో పర్యటించారు. దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. సూపర్‌వైజరు శ్రీధర్ , ఏఎన్ఎం, తదితరులు ఉన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం

గోనెగండ్ల, జూన్ 28: గోనెగండ్లలో అంటువ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. అలాగే ఆరుబయట ఉండే నిలువ నీటిని పారబోశారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లి హైపోక్లోరైడ్ ద్రావణాన్న పిచికారి చేశారు.

కలుషితం లేని నీరు అందిస్తాం

మద్దికెర, జూన్ 28: ప్రజలు రోగాల బారిన పడకుండా కలుషితం లేని నీరు అందిస్తామని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ అన్నారు. శుక్రవారం మద్దికెర గ్రామంలోని ఓవర్‌హెడ్, అండర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. వారు మాట్లాడుతూ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. 15 రోజులకొకసారి ట్యాంకులను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీలో నీటిని వదిలే సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పైపులు లీకేజీ కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, సిబ్బంది విజయ్ ఉన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి


ఎంపీ బస్తిపాటి నాగరాజును అభినందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మద్దికెర, జూన్ 28: రాష్ట్రంలో బీసీలు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పెరవలి కుమ్మరి రామచంద్ర అన్నారు. శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును అభినందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్‌కు నిధులు, బీసీ హాస్టళ్ల మరింత మెరుగు పడే విధంగా సహాయ సహకారాల కోసం ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు.అలాగే కేజీబీవీలో సీట్లు పెంచాలని కోరారు.

పీజీ ఎంట్రెన్స్‌లో మెరిసిన ఆణిముత్యం

● నందినికి రాష్ట్రంలో 4వ ర్యాంకు


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

పత్తికొండ టౌన్, జూన్ 28: ప్రభుత్వ కళాశాలలో చదివే నిరుపేద విద్యార్థిని పీజీ ఎంట్రెన్స్‌లో 4వ ర్యాంకు సాధించి అబ్బురపరిచిన సంఘటన పత్తికొండ నిరుపేద విద్యార్థిని నందిని సాధించి మూరుమూల పత్తికొండను రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చింది. పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నందిని అనే విద్యార్థి బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన పీజీ ఎంట్రెన్స్‌లో ఫిజిక్స్ విభాగంలో 4వ ర్యాంకును రాష్ట్ర స్థాయిలో సాధించడంతో కళాశాల విభాగం ఘనంగా అభినందించారు. ఈ కళాశాలలో చదువుతున్న రాజేశ్వరి 47వ ర్యాంకు, మౌనిక 94వ ర్యాంకు, అస్సిరటీ 103వ ర్యాంకు, శ్రీలత 425, కుసుమ 426 వ ర్యాంకులతో మెరిశారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.మాధురి, అధ్యాపక బృందం శుక్రవారం అభినందించారు.

● **ఐఏఎస్ చదవడమే లక్ష్యం: నందిని**



మాది నిరుపేద కుటుంబం. మా నాన్న నారాయణ చిన్న వస్త్ర దుకాణం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సహకారంతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. ఐఏఎస్ కావడమే లక్ష్యంగా చదువులో ముందుకెళ్తా. భవిష్యత్తులో అనుకున్న లక్ష్యానికి చేరుకుని సమాజ అభివృద్ధికి పాటుపడుతాను.

అగ్రహారంలో తాగు నీటి కష్టాలు


నీటి కోసం వాటర్ ట్యాంకు వద్ద గుమిగూడిన జనం

గోనెగండ్ల, జూన్ 28: మండలంలోని అగ్రహారం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గ్రామానికి తాగునీరు అందించే బోర్లకు నీరు అందకపోవడంతో గ్రామానికి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. గ్రామంలో 5000 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి తాగునీరు అందించే బోరు మల్లెల వంక వాగులో ఉంది. అయితే వంకలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోరుకు నీరు అందడం లేదు, దీంతో గ్రామానికి తాగునీటి సమస్య ఏర్పడింది. పెద్ద వర్షం కురిసి వంకలో నీరు పారితే తాగునీటి సమస్య తీరుతుంది. అయితే ఇప్పటికీ వరకు వంకలో నీరు పారేంత వర్షం కురియక పోవడంతో ఈ సమస్య తీవ్రమైంది. గ్రామాలలోని పలు వీధులకు నీరు సరఫరా కావడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వ అధికారులు గత నెల 15 తేదీ వరకు ట్యాంకర్లతో నీటిని తరలించి ఆ తరువాత నీటి తరలింపును మాని వేశారని గ్రామస్థులు తెలుపుతన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.